## కెరీర్ కార్నర్

### లైఫ్‌స్కిల్స్



# మేనేజ్‌మెంట్ గురువులకు గురువు
# పీటర్ ఫెర్డినాడ్ డ్రక్కర్

'నీటి బుడగ. జీవితకాలం సగటున 26 సెకన్లు. ఆపై అది పగిలిపోతుంది. డ్రక్కర్ 'అటెన్షన్ టు డీటైల్' అలాంటిది. అందరికీ అర్థమయ్యే రీతిలో సునిశిత పరిశీలనా దృష్టితో ఆధునిక మేనేజ్‌మెంట్ గురించి వివరించిన 'మేనేజ్‌మెంట్ గురువులకు గురువు' పీటర్ ఫెర్డినాడ్ డ్రక్కర్. అనారోగ్యంతో 2005 నవంబర్ 11న అమెరికాలోని క్లెర్‌మౌంట్‌లో మరణించాడు. క్లెర్‌మౌంట్ యూనివర్సిటీలో డ్రక్కర్ మేనేజ్‌మెంట్ బోధించేవాడు.

డ్రక్కర్ పుట్టింది 1909, నవంబర్ 19న, ఆస్ట్రియాలోని వియన్నాలో. రెండవ ప్రపంచ యుద్ధం సమయానికి అతని వయస్సు నాలుగు సంవత్సరాలు.

జర్మనీలో హిట్లర్ అధికారంలోకి వచ్చాక యూదులపై దాడులు పెరిగాయి. యూదు జాతీయుడైన డ్రక్కర్ 1937లో తన తల్లి దండ్రులతో అమెరికా చేరాడు. 1943లో అమెరికా పౌరసత్వం పొందాడు. 1950 నుంచి 71 వరకు న్యూయార్క్ యూనివర్సిటీలో మేనేజ్‌మెంట్ బోధించాడు. అప్పటి నుంచి మరణించే వరకు క్లెర్‌మౌంట్ యూనివర్సిటిలోనే ఉన్నాడు.

• • •

ప్రపంచవ్యాప్తంగా పేరున్న వాల్ స్ట్రీట్ జర్నల్‌కు డ్రక్కర్ కాలమిస్టుగా పని చేశాడు. హార్వర్డ్ బిజినెస్ రివ్యూకు కూడా వ్యాసాలు రాస్తూ ఉండేవాడు.

ప్రపంచంలో అతి పెద్ద బహుళజాతి కంపెనీలకు డ్రక్కర్ కన్సల్టెంట్‌గా ఉన్నాడు. బహుశా మేనేజ్‌మెంట్‌ను డ్రక్కరే కనిపెట్టాడంటే అతిశయోక్తి కాకపోవచ్చు. అతని థియరీ రావడానికి ముందు కూడా మేనేజ్ చేసేవారు. కానీ ఎలా చెయాలి అని తెలిసేదికాదు. దానికి ఒక పద్ధతి ఉందని తెలియచేసిన వాడు డ్రక్కర్. మేనేజ్‌మెంట్‌కు సరికొత్త భాష్యాలు చెప్పాడు. డ్రక్కర్ రాకతో కార్పొరేట్ అమెరికా కొత్త అవతారమెత్తింది.

ఈ రోజున మనం నిత్యం వింటున్న, చూస్తున్న, 'ప్రాఫిట్ సెంటర్' డ్రక్కర్ చలవే. 'నాలెడ్జ్ వర్కర్' అన్న మాటను ప్రతిపాదించి, దాన్ని వాడుకలోకి తెచ్చింది డ్రక్కర్ అని మనలో ఎంత మందికి తెలుసు?

భవిష్యత్తు ఎప్పుడు ఇప్పటిలాగే ఉండదంటూ 'Discontinuity' గురించి చెప్పిన మొదటి వ్యక్తి డ్రక్కర్. మేనేజ్‌మెంట్ బై అబ్జెక్టివ్స్‌ను ప్రాతిపాదించింది కూడా ఇతనే.

గుత్తాధిపత్యంతో నడుస్తున్న బహుళజాతి కంపెనీల మేనేజ్‌మెంట్‌ను అలా కాదని 'వికేంద్రీకరణ' బాట పట్టించిందీ డ్రక్కరే.

ప్రస్తుత ప్రభుత్వాలు వికేంద్రీకరణను పాటిస్తున్నాయంటే అది డ్రక్కర్ గొప్పతనమే. 1997లో ఫోర్బ్స్ పత్రిక తన కవర్ పేజీపై అతని ఫోటో ప్రచురించి 'ఈ తరం యువ మేధావి' అని శ్లాఘించింది. అప్పటికీ డ్రక్కర్ వయస్సు 87 సంవత్సరాలు. వయస్సు రీత్యా ముదుసలైనా అతని ఆలోచనలు నిత్య యవ్వనంగా ఉండేవి. డ్రక్కర్ పత్రికలకు వ్యాసాలే కాకుండా సుమారు 30 పుస్తకాల వరకు రాశాడు. అంతేకాదు ఇటీవలి కాలం వరకు శాటిలైట్ ద్వారా తన విద్యార్థులతో క్లాసులలో పాల్గొనేవాడు.

'నేను వినడం ద్వారా నేర్చుకుంటాను' అని అంటుండేవాడు. వ్యాసాలు, పుస్తకాల ద్వారా తన ఆలోచనలను అందరితోనూ పంచుకునేవాడు.



'No executive has ever suffered because his subordinates were strong and effective.'
**- Peter F Drucker (1909-2005)**

• • •

డ్రక్కర్ పుస్తకాలను చదవడం వల్ల మేనేజ్‌మెంట్ గురించే కాదు, ఇంకా చాలా విషయాలు తెలుసుకోవచ్చు. డ్రక్కర్ పుస్తకాలు ప్రతి ఒక్కరు చదవగలిగినవే.

'కాన్సెప్ట్ ఆఫ్ కార్పోరేషన్' అన్న పుస్తకం 1945లో రాశాడు. జనరల్ మోటార్స్ సంస్థలో మేనేజ్ మెంట్‌కు వికేంద్రీకరణ ఎలా సహాయం చేస్తుంది అన్నది ఆ పుస్తకంలో తెలి పాడు. వికేంద్రీకరణ మూలంగా చిన్న చిన్న యూనిట్లుగా తయారయ్యే వ్యక్తులు తమకు గుర్తింపు రావడం ద్వారా ఎలా ఉత్తేజితులై సంస్థ పురోగమనానికి తోడ్ప డతారో సోదాహరణంగా వివరించాడు. అయితే ఆ పుస్తకం జనరల్ మోటార్స్‌కు నచ్చక నిషేధించడం కొసమెరుపు. ఈ విషయాన్ని జపనీయులు గమనించి ఆచరణలో పెట్టారు. ఫలితంగా 1980 ప్రాంతంలో జపాన్ తన ఉత్పత్తులతో ఆ దేశ మార్కెట్‌ను ముంచెత్తే వరకు అమెరికా నిద్రపోయింది.

'మానవ వనరులే మూలధనం. ఈ విషయాన్ని జపనీయులు అర్థం చేసుకున్నా ఇతరులు గుర్తంచలేదంటారు' డ్రక్కర్. 'రెస్పాన్సిబుల్ వర్కర్' అన్న డ్రక్కర్ సూత్రాన్ని, టయోట కంపెనీ ఆచరించింది. ఈ రోజున జపాన్‌లో 'లైఫ్ టైమ్ ఇన్‌కం' ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతోంది. ఉద్యోగాలు చేయడం కూడా అలాగే ఉంది.

'ఎఫెక్టివ్ ఎగ్జికూటివ్'లో బిజినెస్‌కు కొత్త నిర్వచనం ఇచ్చాడు. బిజినెస్ అంటే లాభాలను ఆర్జించడమే కాదంటాడు. ఒక వ్యక్తి సమాజంలో భాగంగా వ్యాపారం చేస్తున్నాడు కాబట్టి తన చుట్టూ ఉన్న సంఘం బాగుంటే అతని వ్యాపారం బాగుంటుంది. సంఘంలో భాగంగా ఉన్న వ్యక్తి మన కస్టమర్. ఆ కస్టమర్లనే మనం తయారు చేసుకోగలగాలి. వ్యాపారం అంటే అది.

డ్రక్కర్ శుద్ధ కాపిటలిస్టు అని అనుకోకూడదు. ఆర్థిక అసమానతలు పెరిగి అంతరాలు ఎక్కువ అవుతున్నాయని గమనించిన డ్రక్కర్ 'నాన్ ప్రాఫిట్' సంస్థలకు ప్రాముఖ్యతనివ్వాలి అని అంటాడు. ఆ దిశగానే గత కొన్ని దశాబ్దాలుగా పయనిస్తూ వచ్చాడు. ఆర్థికంగా బలపడిన 'ట్రాన్స్‌నేషనల్ కార్పొరేషన్స్'వల్ల వచ్చే ఉపద్రవాలను ఎదుర్కొవడానికి ఈ నాన్ ప్రాఫిట్ సంస్థలే దారి చూపుతాయనేది డ్రక్కర్ విశ్వాసం.

– అనిల్ అట్లూరి,
lifeskills@thus.co.in